క్లుప్తంగా

బండి సంజయ్‌కు ఘన స్వాగతం



బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

తిరుమలగిరి : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు ఆదివారం తిరుమలగిరిలో ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆయనను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ కడియం రామచంద్రయ్య, వై.ధీన్‌దయాళ్‌, యాదగిరి, వెంకట్‌రెడ్డి, పూలమ్మ, శోభారాణి, వెంకటేశ్వర్లు, రవి, చంద్రశేఖర్‌, సాయిబాబా, హన్మంతు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



శ్రీనివాస్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్‌ : మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు పుట్ట శ్రీనివాస్‌గౌడ్‌ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మృతుడి కుటుంబాన్ని రాష్ట్ర విద్యుత్‌ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, సర్పంచ్‌ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, ఎంపీటీసీ మామిడి రేవతిపరందాములు, దంతాల వెంకన్న, నాగార్జున ఉన్నారు.

ఆవు దూడల పంపిణీ



రైతులకు గోవులను పంపిణీ చేస్తున్న వీరభద్ర గోశాల సభ్యులు

తుంగతుర్తి : మండల పరిధిలోని రామన్నగూడెంతండాలో రైతులకు శ్రీవీరభద్ర గోశాల ఆధ్వర్యంలో ఆదివారం ఆవుదూడల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ గోశాల ఫెడరేషన్‌ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్‌ అగర్వాల్‌ రామన్నగూడెం తండాలోని 10 మంది రైతులకు 20 ఆవుదూడలను పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు గోవులను పెంచడం ద్వారా జీవనోపాధి కలుగుతుందని, భూసారాన్ని, పర్యావరణాన్ని కాపాడవచ్చని అన్నారు. గోవులను పెంచడం ద్వారా వాటి నుంచి మలమూత్రాలతో సేంద్రియ ఎరువులు తయారవుతాయని, సేంద్రియ ఎరువుల వాడకంతో పంటల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కాంతమ్మ రాములునాయక్‌, గోశాల ప్రతినిధులు నవీన్‌, కిరణ్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తారిఖ్‌ అన్సారీ నియామకంపై హర్షం



అన్సారీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అబ్బాస్‌

నూతనకల్‌ : రాష్ట్ర మైనార్టీ కమిషన్‌ చైర్మన్‌గా తారిఖ్‌ అన్సారీని నియమించడంపై కో ఆప్షన్‌ మెంబర్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌ అలీ అబ్బాస్‌ ఆదివారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు కంటివైద్య శిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో సోమవారం వరంగల్‌కు చెందిన శరత్‌ మ్యాక్సీవిజన్‌ లేజర్‌ కంటి హాస్పిటల్‌ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుధగాని నాగేశ్వర్‌రావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు హెల్త్‌కార్డులు వెంట తెచ్చుకోవాలని కోరారు.

ప్రశాంతంగా సీఓఈ పరీక్ష

తుంగతుర్తి : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన సీఓఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్‌ శ్యామలత మాట్లాడారు. ఇంటర్‌ ప్రథమ సంవత్సరం 2023–24 ప్రవేశపరీక్షకు 504 మంది హాజరు కావాల్సి ఉండగా 472 మంది హాజరైనట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలపై పట్టింపేదీ?

- పలు పాఠశాలల్లో కానరాని మౌలిక వసతులు
- శిథిల భవనాల్లోనే తరగతుల నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



శిథిలావస్థలో ఉన్న అనంతగిరి ప్రభుత్వ పాఠశాల భవనం



నేలపై కూర్చున్న విద్యార్థులు

అనంతగిరి : సర్కార్‌ బడుల్లో కార్పొరేట్‌ వసతులు.. ఇంగ్లిష్‌ చదువులు.. అంటూ బడిబాట కార్యక్రమంలో ప్రచారార్భాటం చేసిన విద్యాశాఖకు క్షేత్రస్థాయిలో సమస్యలు కనిపించడం లేదు.

ప్రభుత్వ పాఠశాలలపై అధికారులకు పట్టింపులేదనడానికి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మండలంలో జెడ్పీ పాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు మొత్తం 34వరకు ఉన్నాయి. కాగా త్రిపురవరం, అనంతగిరి, ఖానాపురంతో పాటు పలు గ్రామాల్లోని పాఠశాలలో మౌలికవసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్రిపురవరం పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు పడరానిపాట్లు పడుతున్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేక నానా అవస్థలు పడాల్సివస్తుందని వాపోతున్నారు. అదే విధంగా తాగునీటిని ప్రతి విద్యార్థి తమ వెంట ఇంటి నుంచి వాటర్‌బాటిల్‌ తీసుకురావాల్సిందే. పాఠశాలకు గ్రామపంచాయతీ నీరు కూడా రాకపోవడంతో వాటర్‌ట్యాంక్‌ల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దర్శమిస్తున్నాయి. అంతేకాక కొన్ని ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్‌ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యుత్‌ అధికారులు సరఫరాను తొలగించారు. ఈ విషయాన్ని అధికారులు తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని పాఠశాల తరగతి గదుల్లో బల్లాలు లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే కూర్చొని తరగతులు వినాల్సివస్తుంది.

శిథిలావస్థలో భవనాలు..

మండలంలోని ఆయా గ్రామాల్లో గల పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని గుండంబండపై గల జెడ్పీ పాఠశాల సుమారు 1965లో నిర్మించారు. ఈ పాఠశాల దాదాపుగా శిథిలమై పైకప్పు పెచ్చులు నిరంతరం ఊడి పడుతుండడంతో స్పందించిన నాటి విద్యాశాఖ అధికారులు నూతన భవనాన్ని నిర్మించారు, ఆ భవనం పక్కనే శ్మశానవాటిక ఉండడంతో అందులో తరగతుల నిర్వహణకు సిబ్బంది ముందుకు రాలేదు. దీంతో ఆ భవనాన్ని మండలాల ఏర్పాటులో భాగంగా తహసీల్దార్‌ కార్యాలయానికి కేటాయించారు. గత కొద్ది సంవత్సరాలుగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భవనాన్ని తిరిగి పాఠశాల అప్పగించాలంటూ విన్నవించినా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం శిథిల భవనంలో తరగతుల నిర్వహణ చేస్తున్నారు. మరి కొన్ని పాఠశాలలో స్వీపర్లు లేకపోవడంతో పాఠశాల ఆవరణలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి



పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇంటి నుంచి బాటిళ్లలో నీటిని తీసుకోని వస్తున్నాం. పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో పాఠశాల గోడ పక్కన కొంత స్థలాన్ని శుభ్రం చేసుకొని మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. పాఠశాలలో తక్షణమే తాగునీటి సౌకర్యంతో పాటు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి.

– శ్రీరాం అభిలాష్‌, ఐదో తరగతి, త్రిపురవరం

బల్లలు, విద్యుత్‌ సౌకర్యం కల్పించాలి



నేను నాల్గొవ తరగతి చదువుతున్నాను. మా పాఠశాల క్లాస్‌ రూంలలో కూర్చునేందుకు బల్లలు లేవు, విద్యుత్‌ సౌకర్యం కూడా లేకపోవడంతో ప్యాన్లు ఏర్పాటు చేయలేదు. నేలపై కూర్చోవాలంటే ఇబ్బందిగా ఉంది. నేను ప్రైవేట్‌ నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివేందుకు వచ్చాను. క్లాస్‌రూంలో ప్యాన్‌లు లేకపోవడంతో వేడికి కూర్చోలేకపోతున్నాం.

– జ్ఞానప్రియ, 4వ తరగతి, త్రిపురవరం

'మన ఊరు మన బడి'లో సమస్యలు పరిష్కరిస్తాం



మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నాం. మొదటి విడతలో భాగంగా 11 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగింది. మరో రెండు విడతల్లో మిగతా పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం.

– సలీం షరీఫ్‌, ఎంఈఓ, అనంతగిరి

నిరుద్యోగులను ఆదుకోవడంలో విఫలం



మహాసభలో మాట్లాడుతున్న పీవైఎల్‌ రాష్ట్ర కార్యదర్శి సాగర్‌

మునగాల : నిరుద్యోగ యువతను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, వారి పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్‌) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరు సాగర్‌ అన్నారు. ఆదివారం మండలంలోని కొక్కిరేణిలో నిర్వహించిన సంఘం డివిజన్‌ 8వ మహాసభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకు నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుందని, నిరుద్యోగ యువతను ఆదుకోవడంలో పాలకులు, ప్రభుత్వాలు విఫలమవుతున్నారని ఆరోపించారు. పాలకవర్గాలు ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే చట్టాలను మార్చి పెట్టుబడుదారులకు, దోపిడీదారులకు, భూస్వాములకు ఉపయోగపడే విధంగా నూతన చట్టాలను తీసుకువస్తున్నాయన్నారు. మతం ముసుగులో, ప్రాంతాల ముసుగులో ప్రజలను విడదీసి రెచ్చగొట్టి పాలిస్తున్నారన్నారు. యువత ప్రజల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మహాసభలో సంఘం జిల్లా నాయకుడు కామళ్ల అనంతరామయ్య అధ్యక్షత వహించగా, రాష్ట్ర నాయకుడు ధరావత్‌ రవి పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పీవైఎల్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లగొండ నాగయ్య, కునుకుంట్ల సైదులు, రాష్ట్ర నాయకులు ధరావత్‌ రవి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్‌, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌గిరి, నాయకులు గండు నగేష్‌, మురళి, సైదా, బ్రహ్మం, బాలయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ఇంటర్‌ ప్రవేశ పరీక్ష



ప్రవేశపరీక్షకు క్యూలో ఉన్న విద్యార్థులు

మునగాల : నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన గురుకులం 2023–24సంవత్సర ఇంటర్మీడియట్‌ ప్రథమ సంవత్సరం ప్రవేశపరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు చీఫ్‌ సూపరింటెండెంట్‌ సీహెచ్‌.ధనలక్ష్మి తెలిపారు. ఈ ప్రవేశపరీక్షలో 504మంది విద్యార్థులకు గాను 468మంది హాజరు కాగా 36మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఉదయం 9గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించినట్లు పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసు సిబ్బందితో 144సెక్షన్‌ విధించామన్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంటల్‌ అధికారి హాసీనాబేగమ్‌ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు



రేబల్లెలో రంగులతో ముస్తాబుచేసిన ఆలయాలు



ఆలయంలో కొలువైన శారదా చంద్రమౌళేశ్వర స్వామి

- నేటి నుంచి రేబల్లెలో బ్రహ్మోత్సవాలు

హుజూర్‌నగర్‌ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని రేబల్లె గ్రామంలో వేంచేసి ఉన్న అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీశారదా చంద్రమౌళీశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం (నేటి) నుంచి 10వతేదీ వరకు 5రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 6వ తేదీ ఉదయం శివాలయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అంకురార్పణ, ధ్వజారోహణము తదితర పూజలు నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. 7న ఉదయం వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సుప్రభాత సేవ తదితర పూజలు, అర్ధరాత్రి దాటిన తర్వాత కల్యాణోత్సవం, 8న గ్రామోత్సవం, రాత్రి పలవళింపు సేవ, 9న వసంతోత్సవం, చక్రస్నానము, 10న స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, రాత్రి ద్వాదశ ప్రదక్షిణల తదితర విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పూజారులు, నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5రోజుల పాటు నాటికలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఎద్దుల పందేలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కార్పొరేట్‌ కళాశాలలను తక్షణమే రద్దుచేయాలి

గరిడేపల్లి : ర్యాంకుల ఆశలతో విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురిచేయడంతో వారి ఆత్మహత్యలకు కారణమవుతున్న కార్పొరేట్‌ కళాశాలలను తక్షణమే రద్దు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు రాంబాబుగౌడ్‌ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్‌ కళాశాలలు అధిక ఫీజులను వసూలు చేస్తూ పేద విద్యార్థులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ర్యాంకుల పేరుతో బలవంతంగా ఫీజులు వసూళ్లతో పాటు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ వారి ఆత్మహత్యలకు కారణం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్‌ వ్యవస్థతో విద్యావ్యవస్థ పూర్తిగా వ్యాపారంగా మారిందన్నారు.

కుటుంబానికి చేయూత



పిండి మిల్లు అందజేస్తున్న అనిల్‌కుమార్‌

సూర్యాపేట రూరల్‌ : సూర్యాపేట మండలంలోని ఎదురోళ్లగూడెం గ్రామానికి చెందిన లింగంపల్లి రాజుకు ప్రమాదవశాత్తు చెట్టు మీది నుంచి కిందపడటంతో నడుములు విరిగాయి. దీంతో అతడు మంచానికే పరిమితం అయ్యారు. జీవనోపాధికి ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు, జీఏకే ట్రస్ట్‌ చైర్మన్‌ అనిల్‌ కుమార్‌ ఆ కుటుంబానికి అండగా నిలిచారు. అతడి ఇంటికి వెళ్లి కుటుంబ పోషణ కోసం పిండి మిల్లు అందజేశారు. అన్ని విధాలా అండగా ఉంటానని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చులతో పాటు తక్షణం బీమా చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రెసివ్‌ తెలంగాణ ఫౌండేషన్‌ చైర్మన్‌ లౌతు కనకయ్య, మున్నూరుకాపు మహాసభ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి రమేష్‌, గౌరవ సలహాదారులు దంతాల వీరన్న, మున్నూరుకాపు మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రామసాని శ్రీనివాస్‌ నాయుడు, మున్నూరు కాపు మహాసభ పట్టణ అధ్యక్షుడు డేగల రమేష్‌ నాయుడు, రుక్మారావు, మహేష్‌నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

యరగాని రామస్వామికి నాటక వైభవరత్న అవార్డు

హుజూర్‌నగర్‌రూరల్‌ : మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన సీనియర్‌ రంగస్థల కళాకారుడు యరగాని రామస్వామి నాటక వైభవరత్న అవార్డు అందుకున్నారు. శనివారం రాత్రి సికింద్రాబాద్‌లోని శ్రీహరిహర కళాభవన్‌లో ఉగాది మహోత్సవ సువర్ణ కంకణ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రుద్రాక్ష వైభవం సువర్ణ కంకణ అవార్డు, నాటక వైభవరత్న అవార్డును సినీ నటుడు తల్వార్‌ సుమన్‌ చేతుల మీదుగా రామస్వామి అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు లయన్‌ విజయ్‌కుమార్‌, బ్రహ్మశ్రీ డాక్టర్‌ శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి, ఎస్‌పీఎఫ్‌ కమాండెంట్‌ డాక్టర్‌ కెఎస్‌ రావు, అసెంబ్లీ సెంట్రల్‌ ఏసీపీ తేజావత్‌ శ్రీరాందాస్‌, రిటైర్డ్‌ జడ్జి బూర్గుల మధుసూదన్‌, టెలివిజన్‌ నటులు విశ్వంరాజు, గోపాల్‌రెడ్డి, నిర్మాలానంద, కిరణ్‌గౌడ్‌, వెంకటేశ్వర్లు కళాకారులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న రామస్వామి

నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు



మాట్లాడుతున్న పందిరి నాగిరెడ్డి

మోతె : గ్రామాల్లో నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించనున్నట్లు పందిరి ఫౌండేషన్‌ చైర్మన్‌ పందిరి నాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఉర్లుగొండ గ్రామంలో పందిరి ఫౌండేషన్‌, సంకల్ప సీ స్టార్‌ ఆస్పత్రి ఖమ్మం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు పందిరి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందిస్తామన్నారు. నేడు ఉర్లుగొండలో నిరుపేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం సంకల్ప ఆసుపత్రి యూరాలజిస్టు డాక్టర్‌ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. నేడు సామాన్యుడికి వైద్యం అందని ద్రాక్షలా మారిందన్నారు. పందిరి ఫౌండేషన్‌, సంకల్ప సీ స్టార్‌ ఆధ్వర్యంలో 8మంది వైద్యులతో 400 మందికి వైద్యసేవలు అందించి రోగులకు రూ.3లక్షల విలువ గల మందులు అందించినట్లు ఆయన తెలిపారు. తమ ఆసుపత్రిలో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్‌ గౌరవ సలహాదారు ఎస్‌ఎస్‌ రావు, సర్పంచ్‌ మామిడి అనిత, ఉపసర్పంచ్‌ ఎల్‌.వెంకన్న, మాజీ సర్పంచ్‌ ఎల్‌.కృష్ణకుమార్‌, కొండపల్లి వెంకటలక్ష్మి, శేఖర్‌రెడ్డి, పులి ఈదయ్య, మండవ వెంకటరమణ, పందిరి ఫౌండేషన్‌ సభ్యులు జలేందర్‌, పాష, రామకోటయ్య, బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్‌ బిల్లు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సృజన

మేళ్లచెరువు : మహిళా రిజర్వేషన్‌ బిల్లును అమలుచేయాలని భారత మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రకరకాల సాకులతో బీజేపీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్‌ బిల్లును అమలు చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. దేశ పాలనలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వీరి పాలనలో సామాన్యుడు బతకలేని స్థితికి దిగజారారని వాపోయారు. మహిళలు, చిన్నారుల సంక్షణలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. రిజర్వేషన్‌ అమలుకు త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కోటమ్మ, రంగమ్మ, శేషమ్మ, వినోదలక్ష్మి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం



సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో శ్రీసరస్వతీ నాట్య కళామండలి ఆధ్వర్యంలో పౌరాణిక పద్యనాటక ప్రదర్శన శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సత్యహరిశ్చంద్రీయం ప్రేక్షకులను విశేషంగా ఆలరించింది. ఈ నాటకంలో సీనియర్‌ రంగస్థల కళాకారులు హరిశ్చంద్రుడు, చంద్రమతి, విస్వామిత్రుడు, లోహితుడు, నక్షత్రకుడు, కాల కౌశకుడు, కేశవుడు, బిల్వమంగలుడు, రాధా, సుబ్బిశెట్టి, చింతామణి, శ్రీహరి, సత్యకీర్తి తదితర పాత్రలను చక్కటి పద్యాలతో అడవిసీను, వారణాసి సీను, కాటిసీను నాటకాన్ని రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జామున 4గంటల వరకు ప్రదర్శించారు. అనంతరం కళాకారులను స్థానిక కళామండలి అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ అవార్డు గ్రహీత గుండు వెంకటేశ్వర్లు, నంది, గరుడ, హనుమ అవార్డు గ్రహీత షేక్‌ ముస్తాఫ ఆధ్వర్యంలో కళాకారులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కీత జ్యోతిరామారావు, ఎంపీటీసీ షేక్‌ మున్నీసాచాంద్‌మియా, తుంబర అవార్డు గ్రహీత షేక్‌ సైదాహుస్సెన్‌, కళాకారులు గానకోకిల అవార్డు గ్రహీత గుండు సైదులు, యోగానందరెడ్డి, పాండురంగాచారి, జానిమియా, విజయారాణి, రామ్‌చరణ్‌, శివరాంనాయక్‌, అశ్విని, కోటేశ్వరరావు, భూషయ్య, శాంతి, గ్రామపెద్దలు, ప్రేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మద్యానికి బానిసలు చేస్తున్న కేసీఆర్‌



మద్యం బాటిళ్ల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

హుజూర్‌నగర్‌ : తెలంగాణ ప్రజలను సీఎం కేసీఆర్‌ మద్యానికి బానిసలుగా మార్చుతున్నారని బీజేపీ నల్లగొండ పార్లమెంట్‌ ఇన్‌చార్జ్‌, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని చౌరస్తాలో బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు అంబళ్ల నరేష్‌ ఆధ్వర్యంలో మద్యం బాటిళ్ల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. తెలంగాణ ప్రజలను మద్యానికి బానిస చేస్తున్న కేసీఆర్‌ డౌన్‌డౌన్‌ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యంతో వచ్చే డబ్బులతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భద్రతా వారోత్సవాలు



ఖనిజ సంరక్షణలో మొదటి బహుమతి అందుకుంటున్న రెయిన్‌ సిమెంట్స్‌ ప్రతినిధులు

మేళ్లచెరువు : మండల పరిధిలోని నాగార్జున సిమెంట్‌ పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్వహించిన గనుల, పర్యావరణ, ఖనిజ సంరక్షణ భద్రతా వారోత్సవాలు కొనసాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా ఆది వారం ఇండియన్‌ బ్యూరో ఆఫ్‌ మైన్స్‌, నాగార్జున సిమెంట్‌ పరిశ్రమ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని రెయిన్‌ సిమెంట్‌ పరిశ్రమ అన్ని విభాగాల్లో ఉత్తమ భద్రతా సంరక్షణలో మొదటి బహుమతి గెలుచుకున్నారు. అదే విధంగా సైంటిఫిక్‌, సిస్టమాటిక్‌ డెవలప్‌మెంట్‌, సస్టైలబుల్‌ డెవలప్‌మెంట్‌, పబ్లిసిటీ ప్రాపగాండ విభాగాల్లోనూ బహుమతులు గెలుచుకున్నట్లు పరిశ్రమ ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో రెయిన్‌ సిమెంట్‌ కర్మాగారం జీఎంలు గురప్ప, శ్రీనివాసరెడ్డి యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

చివరి భూములకు సాగునీరు అందించాలి

మోతె : మండలంలో ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు బహిరంగ లేఖ రాశారు. ప్రతిఎకరాకు సాగు నీరు అందిస్తామని గొప్పలు చెబుతున్నారే తప్ప సాగునీరు అందించిన పాపాన పోలేదన్నారు. ఎమ్మెల్యే ఏనాడు రైతు సమస్యలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఎల్‌ 22 కెనాల్‌ పక్కన సాగు చేసిన వరిపొలాలు నీళ్లు లేక ఎండిపోతున్నాయన్నారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు బూడిద లింగయ్య ఉన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు

- తాగునీటికోసం మూగజీవాల అవస్థలు
- పట్టించుకోని పంచాయతీ పాలకవర్గాలు, అధికారులు
- వినియోగంలోకి తీసుకొని రావాలని కోరుతున్న పాడిరైతులు



ఆచార్యులగూడెంలో నిరుపయోగంగా నీటితొట్టి



జెర్రిపోతులగూడెంలో..

చిలుకూరు : ప్రభుత్వం వేసవిలో పశువుల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. వాటిని నిర్మించిన కొద్దికాలం వరకు నిర్వహణ సక్రమంగా చేపట్టిన పాలకులు ప్రస్తుతం వాటిని పట్టించుకోకపోవడంతో మండలంలోని వివిధ గ్రామాలలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నీటితొట్లు అలంకారప్రాయంగా మారాయి. గ్రామపంచాయతీల నిర్వహణ లోపం, అధికారుల అలసత్వం కారణంగా తొట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో దాహార్తిని తీర్చుకునేందుకు మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మండలంలోని కొన్ని గ్రామాల్లో రూ.50వేలు, మరి కొన్ని గ్రామాల్లో రూ.లక్ష నిధులతో నీటి తొట్లను నిర్మించారు. ప్రసుత్తం మండలంలోని అన్ని గ్రామాల్లో నీటి తొట్లు నిరుపయోగంగానే ఉన్నాయి.

మండలంలో సుమారు 20వరకు నీటితొట్ల నిర్మాణం..

మండలంలోని ఆయా గ్రామాల్లో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు సుమారుగా 20వరకు నీటి తొట్లను నిర్మించారు. గ్రామం నుంచి ఉదయం మేతకు వెళ్లేటప్పుడు, తిరిగి ఇంటికి చేరేటప్పుడు పశువులు నీటిని తాగేందుకు వీలుగా గ్రామశివార్లలో వ్యవసాయ భూముల వద్దకు వెళ్లే దారుల వద్ద వీటిని నిర్మించారు. కొన్నాళ్లు వాటి నిర్వహణ బాగానే ఉన్నా తర్వాత నిర్వహణ లోపంతో శిథిలావస్థలకు చేరాయి. వాటి నిర్వహణ బాధ్యతలను గ్రామపంచాయతీలు నిర్వహించాల్సి ఉంది. చాలా చోట్ల పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు నీటితో తొట్లు నింపాల్సి ఉండగా అలాంటి చర్యలేమి చేపట్టడం లేదు. దాదాపు సగం తొట్ల వద్ద నీటివసతి లేదు. ఉన్న చోట బోరు మోటార్లు మరమ్మతులకుగురై, నల్లా పైపులైన్‌లు పగిలిపోయాయి ఉన్నాయి. దీంతో నీటి తొట్లు పనికిరాకుండా పోతున్నాయి. ప్రస్తుతం ఎండలు ప్రారంభం కావడంతో మేతకు వెళ్లి వచ్చే పశువులకు నీరులేక అలమటిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటితొట్లకు మరమ్మతులు చేట్టి అందుబాటులోకి తీసుకరావాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం



గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న నీటితొట్లను వినియోగంలోకి తీసుకొని వస్తాము. గ్రామపంచాయతీ నిధులతో మరమ్మతులు చేయిస్తాం. నీటి తొట్లలో నిత్యం నీరు ఉండేలా చర్యలు తీసుకుని మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తాం. అవసరమైతే గ్రామశివారులో కూడా మరిన్న నీటితొట్లను ఏర్పాటు చేస్తాం.

– ఈదయ్య, ఎంపీడీఓ, చిలుకూరు